www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 20 | 24-6-2026 | బుధవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



## మెట్రో ఫేజ్-2కు

# గ్రీన్ సిగ్నల్!

### కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ చర్చలు సఫలం

- ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డి, అశ్విని వైష్ణవ్‌లతో భేటీ
- ఆర్థిక, సాంకేతిక అధ్యయనానికి కన్సల్టెంట్ ఎంపిక
- పనుల వేగం పెంచేందుకు ప్రత్యేక సమన్వయ కమిటీ
- ఎల్ అండ్ టీ నుంచి 1వ దశ మెట్రో పూర్తి స్థాయి స్వాధీనం
- డీపీఆర్ మార్పులు, అనుమతుల బాధ్యత ఇక సమన్వయ కమిటీదే
- ప్రజా రవాణా వ్యవస్థలో కొత్త మైలురాయిగా నిలవనున్న ప్రాజెక్టు

రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వడివడిగా పావులు కదుపుతూ కీలక విజయాలు సాధిస్తున్నారు. దశాబ్దాల తరబడి హైదరాబాద్ మహానగర వాసులను వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత చెక్ పెట్టేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో 2వ దశ ప్రాజెక్టు సాధనలో ఆయన అద్భుతమైన ముందడుగు వేశారు. ఈ ప్రాజెక్టు భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతను పారద్రోలేలా కేంద్ర మంత్రులతో ఆయన జరిపిన ఉన్నతస్థాయి సంయుక్త చర్చలు పూర్తిగా సఫలమయ్యాయి. 1వ దశ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా తన చేతుల్లోకి తీసుకోవాలని నిర్ణయించడంతో పాటు, 2వ దశ పనులకు అడ్డుగా ఉన్న ప్రధాన ఆటంకాలను ఈ భేటీ ద్వారా శాశ్వతంగా తొలగించగలిగారు. ప్రాజెక్టు అనుమతులు, భారీ స్థాయి నిధుల సమీకరణ కోసం ఇకపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ముందుకు సాగేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్థిక అధ్యయనం కోసం కన్సల్టెంట్ సంస్థ ఎంపిక, పనుల వేగం పెంచేందుకు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడంతో.. మెట్రో 2వ దశ పనులు ఇక శరవేగంగా పట్టాలెక్కనున్నాయి.

వివరాలు 2వ పేజీలో

## సీఎం కోరిక మేరకే

# ఆ భేటీలు

- కేంద్ర మంత్రులతో మెట్రో ఫేజ్-2 విస్తరణపై చర్చలు
- సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయి
- రాష్ట్ర అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటా
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2



## ఢిల్లీలో మంత్రులు

విమానాశ్రయం, ధాన్యం కొనుగోళ్లపై కేంద్రానికి విజ్ఞప్తులు



- కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, ప్రహ్లాద్ జోషితో భేటీలు
- కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సర్వే, రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని వినతి

2

## ముందు క్షమాపణ

# చెప్పండి!

### ఆ తర్వాతే మధిరలో 'రైతు ఆశీర్వాద సభ' పెట్టుకోండి

- పేదల ఇళ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?
- ఖమ్మం జర్నలస్టులు ఇళ్ల స్థలాలివ్వాలి
- రేవంత్, మంత్రుల తీరుపై హరీశ్ రావు ఫైర్

2




రుణమాఫీ, రైతుబంధు ఎగ్గొట్టి అన్నదాతలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు.. ముందుగా రైతులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆ తర్వాతే మధిరలో ఆశీర్వాద సభ పెట్టుకోవాలని ఆయన హితవు పలికారు. ఖమ్మంలో పేదల ఇళ్లను లాక్కోవడం దారుణమన్న ఆయన.. జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# అరెస్టులతో రైతుల గొంతు నొక్కలేరు!

### మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్

2



# బాసర ఆలయంలో భారీ చోరీ!

3

- మహాకాళి గుడిలో వెండి కిరీటం, హుండీ అపహరణ
- సీసీ కెమెరాలకు బట్టలు కప్పి దొంగల చేతివాటం
- ఉదయం పూజకు వచ్చిన అర్చకుల ద్వారా వెలుగులోకి..





# స్నేహం.. పగ.. జంట హత్యలు!

2

- ఆటో బకాయిలతో మొదలైన గొడవ
- స్కెచ్ వేసి శ్రీధర్ దారుణ హత్య
- ప్రతీకారంతో నిందితుడి తండ్రి హతం

వివరాలు 2లో

# ఎక్సైజ్ ఎస్పీ మల్లారెడ్డి అరెస్ట్!



- ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ
- నిజామాబాద్, హైదరాబాద్‌లో ఏకకాలంలో దాడులు
- మల్లారెడ్డి, బంధువులు, సన్నిహితుల ఇళ్లలో సోదాలు
- కోట్లాది రూపాయల ఆస్తులు, నగదు, లాకర్ల గుర్తింపు
- నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు.. ఆపై రిమాండ్

2

# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు!

### రాష్ట్రవ్యాప్తంగా 2,601 రైతు వేదికల్లో విత్తన మేళాలు

ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో మేళాలను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్

2



# హార్మ్యూజ్‌పై పట్టు కోసం ఇరాన్ బెట్టు





4

- అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్

# పద్మపురస్కారాల ప్రదానం

- పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి
- పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్
- ప్రధాని మోడీ తదితరుల హాజరు



4

# పాక్, ఖతార్‌ను నమ్మలేం

- ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది
- బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది
- జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు

4



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం 24 జూన్ 2026

# స్నేహం.. పగ.. జంట హత్యలు!

**ఆటో బకాయిలతో మొదలైన గొడవ.. రెండో పెళ్లితో భగ్గుమన్న కక్షలు**

**స్కెచ్ వేసి శ్రీధర్ దారుణ హత్య..ప్రతీకారంతో నిందితుడి తండ్రి హతం**

**సూరారంలో భారీ పోలీసు బందోబస్తు**



**మెదక్:** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో తీవ్ర కలకలం రేపిన జంట హత్యల కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ప్రాణ స్నేహితులుగా ఉన్న శ్రీధర్, ప్రభాకర్ మధ్య మొదలైన చిన్న ఆర్థిక వివాదం, ఆపై కుటుంబ గొడవలు దారుణ హత్యలకు దారితీశాయి. 1 హత్య.. రాత్రికి రాత్రే ప్రతీకార హత్యకు కారణమైంది. ఈ ఘటనలతో సూరారం గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. శ్రీధర్, ప్రభాకర్ (ప్రభు) గతంలో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ప్రభు బంధువుల నుంచి శ్రీధర్ 1 ఆటోను వాయిదాల పద్ధతిలో తీసుకున్నాడు. అయితే, 2 నెలల బకాయిల విషయంలో వీరిద్దరి మధ్య గొడవ మొదలైంది. ఈ క్రమంలోనే గతంలో ప్రభు.. శ్రీధర్‌పై హత్యాయత్నానికి కూడా పాల్పడగా అప్పట్లోనే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ గొడవ ఇలా ఉండగానే, శ్రీధర్‌కు వరుసకు చెల్లెలు అయ్యే అమ్మాయిని ప్రభు 2వ పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు, పగ మరింత తీవ్రరూపం దాల్చాయి.

## పక్కా ప్లాన్‌తో.. ఆపై దారుణం..

ఈ వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇద్దరూ 1 చోట కలుసుకుని మాట్లాడుకుందామని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం పరస్పరం ఎక్కడున్నారో సమాచారం ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ క్రమంలో చేగుంట మండలం అనంతసాగర్ వద్దకు శ్రీధర్ బైక్‌పై రాగానే.. అప్పటికే పథకం ప్రకారం అక్కడ వేచి ఉన్న ప్రభు, అతని స్నేహితులు ఆటోతో శ్రీధర్ బైక్‌ను బలంగా ఢీకొట్టారు. అనంతరం శ్రీధర్‌ను దారుణంగా హతమార్చి అక్కడి నుంచి పరారయ్యారు. కన్నకొడుకు శ్రీధర్ హత్యకు గురయ్యాడనే విషయం తెలియడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ప్రతీకారంతో రగిలిపోయారు. ప్రభుపై కక్షతో అర్ధరాత్రి వేళ అతని తండ్రి యాదగిరిని టార్గెట్ చేసి దారుణంగా హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు యాదగిరి మృతదేహాన్ని మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామ శివారులోని హల్దీవాగులో పడేశారు.

## గ్రామంలో పోలీసు పికెటింగ్..

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శ్రీధర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, హల్దీవాగు నుంచి వెలికితీసిన యాదగిరి మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ జంట హత్యల నేపథ్యంలో సూరారం గ్రామంలో మళ్లీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ఏసీబీకి చిక్కిన గాంధీనగర్ ఎస్సై!

**రూ. 50 వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత**

**స్టేషన్ బెయిల్ కోసం బాధితుడి నుంచి రూ. లక్ష డిమాండ్**

**నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన అధికారులు**

**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ ఎస్సై వి.నరసింహులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. ఒక కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు బాధితుడి నుంచి మొదటి విడతగా రూ. 50 వేలు లంచం తీసుకుంటూ మంగళవారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఒక కేసులో తనకు స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో పాటు, భవిష్యత్తులో ఎలాంటి వేధింపులకు గురిచేయవద్దని కోరుతూ ఓ వ్యక్తి గాంధీనగర్ ఎస్సై నరసింహులును ఆశ్రయించాడు. ఇందుకు ఆ ఎస్సై ఏకంగా రూ. లక్ష లంచం డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేని ఆ బాధితుడు వెంటనే హైదరాబాద్ సిటీ రేంజ్ 1 ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారి పథకం ప్రకారం మంగళవారం సాయంత్రం బాధితుడి నుంచి ఎస్సై మొదటి విడతగా రూ. 50 వేలు తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైపై కేసు నమోదు చేసి, అరెస్ట్ అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.


# కిచెన్‌లో బొద్దింకలు.. ఫ్రిజ్‌లలో బూజు!

**కంచి కేఫ్, కోడికూర చిట్టిగారే హోటళ్లకు అధికారుల నోటీసులు**

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఎన్నిసార్లు దాడులు చేసినా పలు రెస్టారెంట్ల యాజమాన్యాల తీరు మారడం లేదు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పుప్పాలగూడలోని 'కంచి కేఫ్', నల్లగండ్లలోని 'కోడికూర చిట్టిగారే' హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఫ్రిజ్‌లలో బూజు పట్టిన పదార్థాలు, వంటగదిలో బొద్దింకలు తిరుగుతుండటాన్ని గుర్తించి ఆ 2 ప్రముఖ రెస్టారెంట్లకు నోటీసులు జారీ చేశారు. పుప్పాలగూడలోని కంచి కేఫ్‌లో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. వంటగది, స్టోర్ రూమ్ మధ్య ఓపెన్ డస్ట్‌బిన్లు ఉండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వస్తూ.. ఈగలు ముసురుతున్నాయి. గ్రైండింగ్ చేసే ప్రాంతాల్లో నీరు నిలిచి అపరిశుభ్రంగా మారింది. వంటకు ఉపయోగించే కాలిఫ్లవర్‌పై ఫంగస్ పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన పిండిపై ఎలాంటి లేబుల్స్ లేవు. వంటగదిలో ఈగలు, బొద్దింకలు తిరుగుతుండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ఫిట్‌నెస్, పెస్ట్ కంట్రోల్, వాటర్ టెస్టింగ్ రికార్డులు ఏవీ నిర్వాహకుల వద్ద లేకపోవడంతో తీవ్రంగా హెచ్చరించి నోటీసులు ఇచ్చారు.నల్లగండ్లలోని కోడికూర చిట్టిగారే రెస్టారెంట్‌లోనూ తనిఖీలు కొనసాగాయి. ఇ

# మెట్రో ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్!

- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ చర్చలు సఫలం
- ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డి, అశ్విని వైష్ణవ్‌లతో భేటీ
- ఆర్థిక, సాంకేతిక అధ్యయనానికి కన్సల్టెంట్ ఎంపిక
- పనుల వేగం పెంచేందుకు ప్రత్యేక సమన్వయ కమిటీ
- ధాన్యం, యూరియా కోసం ఢిల్లీలో రాష్ట్ర మంత్రుల వరుస సమావేశాలు



**న్యూఢిల్లీ:** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న ప్రధాన ఆటంకాలు తాజా చర్చలతో తొలగిపోయాయి. దీంతో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం మరింత సులభతరం కానుంది. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు.

## కన్సల్టెంట్ ఎంపిక.. రోడ్ మ్యాప్..

మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకువెళ్లేందుకు ఒక ప్రతిష్టాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై ఈ సంస్థ రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. అలాగే ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది, నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి.

## పనుల వేగానికి ప్రత్యేక సమన్వయ కమిటీ..

కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామం హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది.

## ఢిల్లీలో బిజీబిజీగా రాష్ట్ర మంత్రులు..

రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉంటూ కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపుతున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. కాగా, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో వీరిద్దరూ సమావేశమయ్యారు.

# సీఎం కోరిక మేరకే ఆ భేటీలు

- కేంద్ర మంత్రులతో మెట్రో ఫేజ్-2 విస్తరణపై చర్చలు
- సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయి
- రాష్ట్ర అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటా
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ :**తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిక మేరకే.. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణపై కేంద్ర మంత్రులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయించినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి ఈ భేటీల వివరాలను పంచుకున్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ఈ భేటీల్లో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. ముఖ్యమంత్రితో కలిసి తాను కూడా కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి స్పందించారు.

## రెండుసార్లు లేఖ రాశారు..

"కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాకు రెండుసార్లు లేఖ రాశారు. ఆ విజ్ఞప్తి మేరకు 22వ తేదీన రైల్వే మంత్రితో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై చాలా సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను.. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తాను" అని కిషన్ రెడ్డి ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

# ఢిల్లీలో మంత్రులు

**విమానాశ్రయం, ధాన్యం కొనుగోళ్లపై కేంద్రానికి విజ్ఞప్తులు**

**కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, ప్రహ్లాద్ జోషితో భేటీలు**

**కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సర్వే త్వరగా పూర్తి చేయాలి**

**రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలి**

**కేంద్ర మంత్రులను కలిసిన ఉత్తమ్, తుమ్మల బృందం**

**న్యూఢిల్లీ:** రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ వేదికగా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఆహార ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో వారు మంగళవారం వేర్వేరుగా సమావేశమయ్యారు. కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణం, రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంపుపై వారు ఈ సందర్భంగా కేంద్రానికి కీలక విజ్ఞప్తులు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు చొరవ చూపాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలంలో సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో ఫీజిబిలిటీ సర్వే చేసినందుకు కేంద్ర మంత్రికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఆ స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేనందున, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో ప్రత్యామ్నాయ స్థలాన్ని ప్రతిపాదించినట్లు ఆయన వివరించారు. ఈ కొత్త స్థలంలో వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం రామాలయానికి దేశ, విదేశాల్లో ఉన్న ప్రాముఖ్యతను కేంద్ర మంత్రికి తుమ్మల ఈ సందర్భంగా గుర్తుచేశారు.



## ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలి..

అనంతరం మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌లతో పాటు నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి బృందం.. కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమైంది. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి తెలంగాణ ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని మరింత పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని ఏకంగా 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర మంత్రిని కోరారు. 2025-26 రబీ సీజన్‌లో తెలంగాణ రికార్డు స్థాయిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని వారు వివరించారు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో కలిపి రాష్ట్రంలో మొత్తం 152 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఒకే ఏడాదిలో ఇంత పెద్ద ఎత్తున సేకరణ జరగడం ఇదే తొలిసారని మంత్రులు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ పెంచిన కోటాను వెంటనే ఆమోదించాలని వారు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు!

**రాష్ట్రవ్యాప్తంగా 2,601 రైతు వేదికల్లో విత్తన మేళాలు**

**ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో మేళాలను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్**

**హైదరాబాద్:** రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చి అధిక దిగుబడులు సాధించేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. నాణ్యమైన విత్తనాలే విజయవంతమైన పంటకు పునాది అని ఆయన అన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విత్తన మేళాలను సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి మంత్రి తుమ్మల ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఉపయోగించడం ద్వారా పంట ఉత్పాదకతను గణనీయంగా పెంచుకోవచ్చని మంత్రి తుమ్మల అన్నారు. రైతులకు సరైన సమయంలో విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లలో అధిక డిమాండ్ ఉన్న 7 సన్న వరి రకాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో సమగ్రంగా చర్చించిన అనంతరం ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## లక్షల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి విత్తనాలతో పాటు పప్పు జాతులు, నూనెగింజలు, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు మంత్రి తెలిపారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకొని స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశముందని పేర్కొన్నారు. జూన్ 23 నుంచి 30 వరకు రాష్ట్రంలోని 2,601 రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాల్లో రైతులకు 1,24,649 క్వింటాళ్ల వరి విత్తనాలు, 6,913 క్వింటాళ్ల పప్పు జాతి విత్తనాలు, 11,815 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలు, 1,339 క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అదనంగా నానో యూరియా, నానో డిఏపి ఎరువులను కూడా రైతుల కొనుగోలుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. విత్తనాల విక్రయంతో పాటు వాటి సాగు విధానాలు, పంట యాజమాన్యం, సమగ్ర పంట సంరక్షణ, అధిక దిగుబడుల సాధనకు సంబంధించిన అంశాలపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సంచాలకులు గోపి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, వరంగల్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వివిధ జిల్లాల కలెక్టర్లు, రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ ఎస్పీ మల్లారెడ్డి అరెస్ట్!

- ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ
- నిజామాబాద్, హైదరాబాద్‌లో ఏకకాలంలో దాడులు
- మల్లారెడ్డి, బంధువులు, సన్నిహితుల ఇళ్లలో సోదాలు
- కోట్లాది రూపాయల ఆస్తులు, నగదు, లాకర్ల గుర్తింపు
- నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు.. ఆపై రిమాండ్



**హైదరాబాద్:** నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమురి మల్లారెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న పక్కా సమాచారంతో.. ఆయనతో పాటు బంధువులు, సన్నిహితుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీ ఎత్తున స్థిర, చరాస్తులను, నగదును గుర్తించిన ఏసీబీ.. మల్లారెడ్డిపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచింది. మూడు సంవత్సరాల క్రితం నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా మల్లారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన భారీగా అక్రమాలకు పాల్పడి ఆస్తులు సంపాదించారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ ఇటీవలే కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగానే మంగళవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. హైదరాబాద్‌లోని మచ్చబొల్లారం, నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లో మల్లారెడ్డి అద్దెకు ఉంటున్న నివాసాలతో పాటు.. ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లు కలిపి మొత్తం 10 చోట్ల ఒకే సమయంలో సోదాలు నిర్వహించారు. నిజామాబాద్‌లోని ఎక్సైజ్ ఎస్పీ కార్యాలయంలో కూడా తనిఖీలు చేసి, అక్కడి సిబ్బందిని విచారించారు.

### కోట్లలో ఆస్తుల గుర్తింపు..

ఏసీబీ సోదాల్లో మల్లారెడ్డికి చెందిన పలు ఆస్తుల చిట్టా బయటపడింది. ఏకంగా 4 ఇళ్లు, 1 వాణిజ్య భవనం, 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఆయన వద్ద సుమారు రూ. 3.31 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ. 50 లక్షల నిల్వలు గుర్తించారు. అలాగే మల్లారెడ్డి భార్య, ఇతర కుటుంబ సభ్యుల పేర్లపై 3 బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించి, వాటిని త్వరలోనే తెరవనున్నట్లు అధికారులు తెలిపారు.

### మార్కెట్ విలువ చాలా ఎక్కువే..

సోదాల్లో గుర్తించిన ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ. 3 కోట్లుగా ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. అయితే బయటి మార్కెట్ విలువ ప్రకారం ఇవి అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోదాల అనంతరం మల్లారెడ్డిని అరెస్ట్ చేసిన అధికారులు.. హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాలతో ఆయనను రిమాండ్‌కు తరలించారు.

# ముందు క్షమాపణ చెప్పండి!

- ఆ తర్వాతే మధిరలో 'రైతు ఆశీర్వాద సభ' పెట్టుకోండి
- రైతుబంధు, రుణమాఫీ, బోనస్ ఎగ్గొట్టి ఆశీర్వాదం అడుగుతారా?
- పేదల ఇళ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?
- ఖమ్మం జర్నలస్టులు ఏం పాపం చేశారు.. వారికి ఇళ్ల స్థలాలివ్వాలి
- రేవంత్, మంత్రుల తీరుపై మాజీ మంత్రి హరీశ్ ఫైర్



**ఖమ్మం:** రైతులకు, ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా దగా చేసిన కాంగ్రెస్ నాయకులకు రైతుల ఆశీర్వాదం అడిగే హక్కు ఎక్కడుందని మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు. మధిరలో త్వరలో తలపెట్టిన 'రైతు ఆశీర్వాద సభ'ను 'రైతు క్షమాపణ సభ'గా మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. మరోవైపు ఖమ్మంలో పేదల ఇళ్లను అక్రమంగా కూల్చివేస్తుండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఇళ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మాజీ మంత్రి హరీశ్ రావు పర్యటించారు. అశ్వారావుపేటలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లో హామీలు అమలు చేయకపోతే నిలదీయమన్న భట్టి విక్రమార్క ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 3 సార్లు రైతుబంధు కన్నా తామిచ్చిన బోనస్ ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. "రెండు సీజన్ల బోనస్ కింద రూ. 2200 కోట్లు ఎగ్గొట్టారు. ఇచ్చిన బోనస్ 3 వేల కోట్లు కూడా దాటదు. కానీ మీరు ఎగ్గొట్టిన రైతుబంధు విలువ రూ. 29,350 కోట్లు.. జూపల్లికి ఈ లెక్కలు తెలుసా? మెదడు ఏమైనా చితికిపోయిందా" అంటూ హరీశ్ రావు ఘాటుగా వ్యాఖ్యానించారు.

### 3 శాఖల్లోనూ సీఎం ఫెయిల్..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు ఎక్కువ.. చేతలు తక్కువ అని ఆయన విమర్శించారు. ఆయన దగ్గర ఉన్న విద్యా, హోం, మున్సిపల్ శాఖల నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారని, కేవలం ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రమే పాస్ అయ్యారని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు రూ. 10 వేలు చొప్పున ఇస్తే.. తాము మూడు పంటలకు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికి ఇప్పుడు మోసం చేశారని విమర్శించారు. భద్రాద్రి రాముడి సాక్షిగా రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్.. ఆ దేవుడినే మోసం చేశారని ఆయన మండిపడ్డారు.

### పేదల ఇళ్లు కూల్చడమేనా?

ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న హరీశ్ రావు.. రేవంత్ సర్కారు ఇందిరమ్మ రాజ్యం పేరుతో పేదల ఇళ్లు కూల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి సొంత జిల్లాలోనే పేదల ఇళ్లు లాక్కోవడం దారుణమన్నారు. ఖమ్మం కలెక్టర్‌తో తాను స్వయంగా మాట్లాడానని, పేదల ఇళ్లు లాక్కుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎవరి స్థలాలైతే లాక్కున్నారో, వారికి వెంటనే స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు.

### జర్నలిస్టులకు స్థలాలివ్వాలి..

ఖమ్మం జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెబుతున్న సీఎం.. మరి ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. వారికి స్థలాలు ఇవ్వకపోతే తాను దగ్గరుండి పోరాడి ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి తనకు హిట్లర్ ఆదర్శమని చెప్పి హైడ్రాను తెచ్చారని, అహంకారం ఉన్నవారే హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటారని ధ్వజమెత్తారు. రేవంత్ పాలన అంతా బ్లాక్ మెయిల్ పాలనగా మారిపోయిందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

# అరెస్టులతో రైతుల గొంతు నొక్కలేరు

- యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్
- ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన సీఎం.. ఎరువులు అడగరా?
- రైతులను ముంచుతున్న మోదీ, రేవంత్ ప్రభుత్వాలు



**హైదరాబాద్:** యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి, రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల ధర్నాకు వెళ్లకుండా హైదరాబాద్‌లో తనను హౌస్ అరెస్ట్ చేయడం దారుణమన్నారు. అరెస్టులతో తమ గొంతు నొక్కాలని చూస్తే రైతుల తిరుగుబాటు తప్పదని, రేవంత్ రెడ్డిది ప్రజా పాలన కాదని.. పక్కా నియంత పాలన అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యూరియా యాప్ వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం తాడ్వాయిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా తలపెట్టారు. ఇందులో పాల్గొనేందుకు బయలుదేరుతున్న వేముల ప్రశాంత్ రెడ్డిని హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ నిరసనను అడ్డుకునేందుకు కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో సుమారు 300 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఉదయం నుంచే అరెస్ట్ చేశారని వేముల మండిపడ్డారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అన్-సీజన్‌లోనే దేశంలో ఎక్కడ యూరియా దొరికినా కొని గోదాముల్లో నిల్వ చేసేవారని వేముల గుర్తుచేశారు. రైతులు పైసలు ఇస్తే నేరుగా పొలాల వద్దకే ఎరువుల బస్తాలు వచ్చేవని, ఆ తెలివి ప్రస్తుత ముఖ్యమంత్రికి లేదన్నారు. రేవంత్ రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి, వాటిని ఏం చేయాలి అన్నదానిపైనే ఉందని విమర్శించారు. నిన్నటి దాకా వడ్ల కొనుగోళ్ల కోసం రైతులను ఏడ్పించిన సర్కారు.. ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు.

### మోదీ కోతలు.. రేవంత్ చేతకానితనం..

ముఖ్యమంత్రి ఢిల్లీకి 72సార్లు వెళ్లారని, మెట్రో రైలుపై సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ మాత్రం లేదని వేముల విమర్శించారు. అటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, రేవంత్ రెడ్డికి కేంద్రం నుంచి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ఎరువులు, వడ్ల కొనుగోళ్ల విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బాసర ఆలయంలో భారీ చోరీ!

- మహాకాళి గుడిలో వెండి కిరీటం, హుండీ అపహరణ
- సీసీ కెమెరాలకు బట్టలు కప్పి దొంగల చేతివాటం
- ఉదయం పూజకు వచ్చిన అర్చకుల ద్వారా వెలుగులోకి..
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ జానకి షర్మిల



**నిర్మల్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మొదటి అంతస్తులో ఉన్న మహాకాళి అమ్మవారి గుడిలోకి చొరబడిన దుండగులు వెండి కిరీటంతో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. కట్టుదిట్టమైన భద్రత ఉండే ఈ ఆలయంలో దొంగలు ఏకంగా గర్భగుడి తాళాలు పగలగొట్టి ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చారు. అప్పటికే తలుపుల తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. వారి సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. గుడి తలుపులు తెరిచి చూడగా అమ్మవారి వెండి కిరీటం, హుండీ మాయమైనట్లు గుర్తించారు. ఈ ఘటనపై వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### కెమెరాలకు బట్టలు కప్పి..

దొంగలు అత్యంత చాకచక్యంగా సీసీ కెమెరాలపై బట్టలు కప్పి ఆలయంలోకి ప్రవేశించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఎత్తుకెళ్లిన హుండీలోని డబ్బులు తీసుకుని, ఖాళీ హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ చోరీ సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. చోరీ జరిగిన తీరును, ప్రాథమిక ఆధారాలను పరిశీలించి.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను వెంటనే పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు.

# రూ. 17 లక్షలతో డ్రైవర్ జంప్!

- పాతబస్తీలో ఏటీఎం క్యాష్ వ్యాన్ చోరీ
- పక్కా స్కెచ్‌తో బైక్‌పై ఉడాయింపు
- సీసీటీవీల ఆధారంగా పోలీసుల ముమ్మర గాలింపు

**హైదరాబాద్:** హైదరాబాద్ పాతబస్తీలో భారీ చోరీ కలకలం రేపింది. ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు నింపే ఓ క్యాష్ వ్యాన్ డ్రైవర్ పక్కా స్కెచ్‌తో ఏకంగా రూ. 17 లక్షల నగదు పట్టుకుని ఉడాయించాడు. పట్టపగలు రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన జరగడం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఏటీఎంలలో డబ్బులు నింపేందుకు వచ్చిన క్యాష్ వ్యాన్ నుంచి నగదును దొంగిలించిన సదరు డ్రైవర్.. ముందుగానే అక్కడ సిద్ధం చేసుకున్న బైక్‌పై ఎక్కి క్షణాల్లో మాయమయ్యాడు. పక్కా ప్రణాళికతోనే ఈ దొంగతనం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళవారం పగటిపూట రద్దీగా ఉండే పాతబస్తీ ప్రాంతంలో ఈ భారీ చోరీ జరగడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు.

### కెమెరాల ఆధారంగా గాలింపు..

ఈ దొంగతనంపై కేసు నమోదు చేసిన చార్మినార్ పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. ఘటనా స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను సేకరించి వాటి ఆధారంగా ముమ్మరంగా గాలిస్తున్నారు. బైక్ వెళ్లిన దారి, ఘటనకు ముందు, ఆ తర్వాత డ్రైవర్ మాట్లాడిన ఫోన్ కాల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ భారీ చోరీలో డ్రైవర్‌కు బయటి వ్యక్తులు ఎవరైనా సహకరించారా అనే కోణంలో కూడా దర్యాప్తును వేగవంతం చేశారు.

# పేరు సూచించండి.. లక్ష గెలుచుకోండి!

- పథకం పేరు ఖరారుపై ప్రజలకు బంపర్ ఆఫర్
- ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో పోటీ
- ఉత్తమ పేరు సూచించిన వారికి లక్ష రివార్డ్
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతమ్ వెల్లడి

**హైదరాబాద్:** ఓఆర్ఆర్ పరిధిలో అల్పదాయ వర్గాల (ఎల్ఐజీ) కోసం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న 1 లక్ష ఇండ్ల పథకానికి తగిన పేరు సూచించిన వారికి 1 లక్ష రూపాయల నగదు బహుమతి ఇస్తామని హౌసింగ్ బోర్డు ప్రకటించింది. ఈ పథకానికి మంచి పేరును నేరుగా ప్రజల నుంచే స్వీకరించేలా వినూత్నంగా సోషల్ మీడియా వేదికగా పోటీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా అల్పదాయ వర్గాల కోసం ఓఆర్ఆర్ పరిధిలో 1 లక్ష ఇండ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ఈ భారీ ప్రాజెక్టును చేపట్టారు. ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటు ధరల్లో ఇండ్లు నిర్మించడంలో హౌసింగ్ బోర్డుకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. సుదీర్ఘ కాలం తర్వాత చేపడుతున్న ఈ భారీ ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలన్న ఆలోచనతో, ఈ పథకానికి పేరును ప్రజల సూచనలతోనే ఖరారు చేయాలని బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం పేరు కోసం ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో పోటీ నిర్వహిస్తున్నారు. ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి 1 లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేయనున్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని గౌతమ్ వివరించారు. త్వరలోనే ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ప్లాట్లను కేటాయిస్తామని, దీనికి సంబంధించిన పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.



# దేశంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రం!

## మహిళా బిల్లు, డీలిమిటేషన్ ఎత్తుగడలతో ప్రాంతీయ పార్టీలకు చెక్!

దేశంలో రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ డంగయిపోతున్నాయి. బెంగాల్ ఫలితాల తరవాత మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆమెను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ మెజార్టీ ఎమ్మెల్యేలు తీర్మానం చేశారు. ఇక మహారాష్ట్రలో బాలథాక్రే స్థాపించిన శివసేన దాదాపు అంతర్థానం అయ్యే దుస్థితిలో ఉంది. యూపిలో అఖిలేశ్ పార్టీలో సైతం ముసలం పుట్టింది. ఇదంతా యాదృచ్ఛికంగా జరుగుతన్నదని భావించడానికి లేదు. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు వీగిపోయిన తరవాత అధికార బిజెపి వేస్తున్న ఎత్తులకు ప్రాంతీయ పార్టీలు చిత్తవుతున్నాయి. ఇదే ఆయా పార్టీల పునాదులను పెకిలిస్తోందని భావించాలి. ఇదంతా కూడా మళ్లీ డీ లిమిటేషన్, మహిళా బిల్లును గట్టెక్కించే పనిలో అధికార పార్టీ చేస్తున్న కసరత్తుగానే గుర్తించాలి. ఈసారి ఈ రెండు బిల్లును ఎలాగైనా గట్టెక్కించే పనిలో మోడీ ద్వయంయ ఉన్నట్లుగా అర్థం అవుతోంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ముసాయిదాను సిద్ధం చేసినా పార్లమెంట్‌లో తగిన మద్దతు దక్కుతుందన్న నమ్మకం కలిగితేనే ఈ బిల్లును సభ ముందుకు తీసుకురావాలని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ చట్టం ఆమోదం పొందాలంటే లోక్‌సభ.. రాజ్యసభల్లో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతటితో ఈ పక్రియ పూర్తి కాదు. దేశంలోని కనీసం సగంరాష్ట్రాల శాసనసభలు ఈ బిల్లును ఆమోదించి తీరాల్సి ఉంటుంది. సంఖ్యాబలంపై పూర్తి ధీమా వచ్చాకే ఎన్డీయే సర్కార్ ఈ మహిళా బిల్లును అధికారికంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. గతంలో జరిగిన అవమానానికి బద్లా తీసుకునే పనిగా కూడా భావిస్తున్నారు. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఈ బిల్లును అమలులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెరవెనుక పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. డీలిమిటేషన్.. సీట్ల పెంపు లాంటి కీలక అంశాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ ఓ సరికొత్త ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే దీనిని గట్టెక్కించే పనిలో భాగగంఅ బలాన్ని పెంచుకునే ఎత్తులో బిజెపి ఉన్టట్లు స్పష్టం అవుతోంది. గతంలో ప్రతగిపాదించినట్లుగానే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను ఏకంగా 50 శాతం పెంచే ఆలోచనలో మోడీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు వ్యతిరేకించడంతో అది వీగిపోయింది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత విపక్షాల బలం తగ్గడంతో మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. మరింత పకడ్బందీగా 133వ రాజ్యాంగ సవరణను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా సీట్ల పునర్విభజన సమయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలకు చెక్ పెట్టేలా ఈ కొత్త ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పెంపు వల్ల జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే.. రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే కొనసాగించాలని కేంద్రం గట్టిగా భావిస్తోంది. అదే సమయంలో ఒక రాష్ట్రం పరిధిలో నియోజకవర్గాల సరిహద్దుల మార్పునకు మాత్రం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది.ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ కొత్త ముసాయిదా లో అత్యంత కీలకమైన అంశం చట్టసభల స్థానాల పెంపు. లోక్‌సభతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను భారీగా పెంచబోతున్నారు. వీలైనంత వరకు అన్ని చోట్లా ఏకంగా 50 శాతం మేర సీట్లను పెంచాలని కేంద్రం భావిస్తోంది.. సాధ్యమైనంత వరకు 50 శాతం పెంపు విధానాన్ని అమలు చేసి.. మహిళలకు తగినన్ని సీట్లు కేటాయించాలని చూస్తున్నారు. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 55, 81, 82తో పాటు 170, 330లకు మార్పులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న డీలిమిటేషన్ బిల్లులో కూడా తగిన సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఈ కొత్త సూత్రాల ఆధారంగానే తన పనిని కొనసాగించాల్సి ఉంటుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే ముందుగా సభలో మొత్తం సభ్యుల సంఖ్య పెరగాలి. అప్పుడే సిట్టింగ్ ఎంపీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సీట్ల పెంపు పక్రియతో కేవలం మహిళలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా భారీగా రాజకీయ లబ్ది చేకూరనుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం చూస్తే.. లోక్‌సభలో ఎస్సీ స్థానాలు ప్రస్తుతమున్న 84 నుంచి ఒకేసారి 136కు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఎస్టీల స్థానాలు కూడా 47 నుంచి 70కి పెరగనున్నాయి. ఈ మార్పు చేయడం ద్వారా లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాలకు దక్కాల్సిన పూర్తి 16 శాతం కోటా వారికి అందుతుంది. పెరిగిన ఈ కొత్త స్థానాల్లో మహిళా రిజర్వేషన్లను వర్టికల్ విధానంలో పక్కాగా అమలు చేస్తారని ప్రచారం. అంటే పెరిగిన ఎస్సీ.. ఎస్టీ స్థానాల్లో కూడా మూడో వంతు సీట్లను ఆయా వర్గాలకు చెందిన మహిళలకే కేటాయిస్తారు. ఈ మొత్తం రాజకీయ పక్రియను 2029 సాధారణ ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డీలిమిటేషన్ విషయంలో పలు రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేలా ప్రధానమంత్రి కార్యాలయం ఇప్పటికే ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే ఈ భారీ నిర్ణయం అమలు చేయడం ప్రభుత్వానికి అంత సులభం కాదు. దీనికోసం చట్టసభల్లో స్పష్టమైన సంఖ్యాబలం అత్యవసరం. అందుకే ఇప్పుడు ఆయా పార్టీల్లో పగుళ్లు పడుతు న్నాయి. బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు ఆయా ప ఆర్టీలకు వణుకు పుట్టించేలా చీలికలు మొదలయ్యాయి. దీంతో లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజార్టీ కోసం యత్నాలు మొదలయ్యాయని భావించాలి. తమిళనాడులో కూడా డిఎంకె పరోక్షంగా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న ఆ పార్టీ,ఇండి కూటమితో కలసి వెళ్లకపోవచ్చు. మొత్తంగా రానున్న రోజుల్లో ఈ ముఖచిత్రం మరింత స్పష్టంగా ఆవిష్కృతం కానుంది.

# ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

- పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి
- పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్
- ప్రధాని మోడీ తదితరుల హాజరు



**న్యూఢిల్లీ, జూన్ 23:** రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేందప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

# హార్ముజ్‌పై పట్టు కోసం ఇరాన్ బెట్టు

## అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్

**టెహ్రాన్, జూన్ 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హార్ముజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హార్ముజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్ముజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్–అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.






# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

## ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన

**వాషింగ్టన్, జూన్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

# మేము లేకుండా యూఎస్ చంద్రుణ్ణి చేరుకోలేదు: జర్మనీ మంత్రి

**బెర్లిన్/పారిస్:** ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌కు చెందిన అత్యాధునిక ఏఐ మోడల్స్ ఇతర దేశాలకు అందకుండా అమెరికా ప్రభుత్వం నిషేధించడంపై ఐరోపాలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఏఐ రంగంలో సార్వభౌమత్వం సాధించాలన్న డిమాండ్స్ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జర్మనీ అంతరిక్ష పరిశోధన శాఖ మంత్రి డొరొతీ బార్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అంతరిక్ష ప్రయోగాలకు ఐరోపా, జర్మనీ అందించే సాంకేతికతలు కీలకమని గుర్తు చేశారు. 'మేము లేకపోతే నాసా స్పేస్ మిషన్లు సాధ్యం కాదు. ఐరోపా సర్వీస్ మాడ్యుల్ లేకుండా నాసా చంద్రుడిని చేరలేదు' అని ఇటీవల వీవాటెక్ ట్రేడ్ షో సందర్భంగా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. అంతరిక్ష రంగంలో ఆధిపత్యం కోసం మరో కూటమి కూడా ఏర్పాటైందని మంత్రి డొరొతీ పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా, ఇరాన్ దేశాలు అంతరిక్ష రంగంలో ఐరోపాను అధిగమించకూడదని స్పష్టం చేశారు. అమెరికా టెక్నాలజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఐరోపా సమాఖ్య భావిస్తోంది. సెమీ కండక్టర్లు మొదలు, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వరకూ వివిధ రంగాల్లో స్వదేశీ సంస్థల అభివృద్ధిపై దృష్టిసారించింది. ఇందుకోసం ఒక వ్యూహాన్ని కూడా రూపొందించుకుంది. ఆర్థికంగా, రాజకీయంగా తాము కోల్పోయిన ప్రాభవాన్ని మళ్లీ దక్కించుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఐరోపా, అమెరికా మధ్య విభేదాలు పెరిగితే అధ్యక్షుడు ట్రంప్ క్రిటికల్ సాంకేతికతలపై నిషేధం విధించవచ్చని ఐరోపాలో ఎప్పటినుంచో భయాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా ఆంత్రోపిక్ ఏఐ మోడల్స్‌పై యూఎస్ నిషేధంతో ఐరోపా అప్రమత్తమైంది.




# పాక్, ఖతార్‌ను నమ్మలేం

- ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది
- బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది
- జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు



**వాషింగ్టన్, జూన్ 23:** పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా– ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా– ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి. మధ్యప్రాచ్యంలో ఆ మూడు దేశాలే అమెరికాకు నిజమైన మిత్రదేశాలు' అని పేర్కొన్నారు. కాగా, వీరి వ్యాఖ్యలు ఇప్పటికే ఉన్న వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది.

## భారీ వర్షా ల దృష్ట్యా ప్రజల సౌకర్యం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### జిల్లా కలెక్ట ర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజల సౌకర్యం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవనంలో కంట్రోల్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షా ల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. వరద పరిస్థితులలో అత్యవసర సేవల నిమిత్తం ప్రజలు కంట్రోల్ రూమ్ నం. 8500844365 లో సంప్రదించవచ్చని తెలిపారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** విత్తనాల కంపెనీ డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని తాండూర్ మండల వ్యవసాయాధికారి కె.సుష్మ అన్నారు. మంగళవారం కొత్తపల్లి రైతు వేదికలో ప్రారంభమైన విత్తన మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలను విక్రయించాలని డీలర్లకు సూచించారు. వానాకాలంలో వరి సాగు చేసే రైతులు ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాలను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఆ రకాల వరి ధాన్యాన్నే కొనుగోలు చేస్తుందని, అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ కూడా అందజేస్తుందని పేర్కొన్నారు. రైతులకు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్, ఏఈఓ ఎం.వెంకటేష్, విత్తన కంపెనీల డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేశెట్టి సంతోష్ కుమార్



**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ ఉద్యమకారుల హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం పనిచేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీ) రాష్ట్ర కమిటీ కీలక నియామకాలు చేపట్టి ంది. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా తాండూర్కు చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక సేవకుడు కేశెట్టి సంతోష్ కుమార్ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ మంగళవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు టీయూవీ మండల అధ్యక్షుడు నిరంజన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా కేశెట్టి సంతోష్ కుమార్ మాట్లా డుతూ ఉద్యమకారుల సంక్షేమం, గౌరవ పరిరక్షణ, తెలంగాణ ఉద్యమ చరిత్రను భావితరాలకు చేరవేయడం, ఉద్యమ కారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేస్తానని చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకాన్ని టీయూవీ నాయకులు నిరంజన్ రావు, మాసాడి శ్రీరాములు, మద్దిబోయిన అర్జున్, బోడ సతీష్ తదితరులు స్వాగతించారు. సంతోష్ కుమార్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

### తేజపూర్ ప్రజల ఆగ్రహం



**ఉద్యమ కెరటం, వాంకిడి:** తేజపూర్ గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ నిర్వాకంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు పక్కన నిర్మించిన డ్రైనేజీ ద్వారా మురుగునీరు సక్రమంగా వెళ్లే లా ఏర్పాటు చేసినప్పటికీ, కొందరు వ్యక్తులు డ్రైనేజీ ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో నీరు నిలిచిపోయిందని తెలిపారు. అయితే సమస్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన గ్రామపంచాయతీ అధికారులు డ్రైనేజీని మట్టితో మూసివే యడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలో నిలిచిపోయిన నీరు రోడ్డుపైకి చేరడంతో సీసీ రోడ్డు బురదమయంగా మారి నడవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్, కార్యదర్శిని ప్రశ్నించగా, సరైన స్పందన లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తునన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే గ్రామంలో పారిశుధ్య సమస్యలు తీవ్ర మయ్యాయని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించి రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించడంతో పాటు మురుగునీటి నిల్వలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్క రించకపోతే ఎంపీడీఓ కార్యాలయంతో పాటు కలెక్టరేట్ను ముట్ట డిస్తామని హెచ్చరించారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్ట ర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, వాంకిడి:** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రికార్డులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవ లసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రికి సంబంధించి ప్రతి అంశాన్ని రికార్డుల రూపంలో నమోదు చేయాలని సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి అధికారులు, సిబ్బంది హాజరు పట్టి క పరిశీలించి విధుల పట్ల బాధ్యతా యుతంగా వ్యవహరించాలని తెలిపారు. మండల అభివృద్ధిలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంతల ఏర్పాటు, జాబ్ కార్డులు, ఉపాధి హామీ పనులకు సంబంధించిన కూలీల చెల్లింపులను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బూత్ స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈనెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని, ఎన్యువరేషన్ ఫారాల అందజేత, తిరిగి సేకరణ, వివరాల నమోదు అంశాలలో జాగ్రత్తగా వ్యవహ రించాలని తెలిపారు. ఇలాంటి పొరపా టులకు తావు లేకుండా స్పష్టమైన జాబితా రూపొందించే దిశగా ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ తగు చర్యలు తీసు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ కృష్ణవేణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు మంజూరు చెయ్యండి

- సిడిఎంఏ, జేడీ కు మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మన్ వినతి





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ పట్టణ మున్సిపల్ పరిధి రోజురోజుకూ విస్తరిస్తూ, జనాభా పెరుగుతున్న నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్లు రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్ట ర్ టి.కె. శ్రీదేవి , జేడీ పల్గున్ కుమార్ కి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ లో ఆమెను కలిసి మున్సిపాలిటీ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆకాష్ , వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లా డుతూ మున్సిపాలిటీ ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఆశించిన స్థాయిలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ, పరిపాలన సాగడం లేదని వివరించారు. దీనికి తోడు తీవ్ర సిబ్బంది కొరత వేధిస్తోందని, కేవలం నాలుగు వార్డు అధికారులతో పనులు నిర్వహించడం భారంగా మారిందని ఉన్నతా ధికారి దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో అంతరత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, తాగునీటి సరఫరా మెరుగుపరచడం, ప్రజా సమస్యల తక్షణ పరి ష్కారానికి ప్రత్యేక నిధుల అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. చెత్త కోసం15 వాహనాలు ఇవ్వాలని, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్యాకేజీ లేదా నిధులను కేటాయించాలని కోరారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఎదుర్కొంటున్న సిబ్బంది కొరత సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు , నూతనంగా ఏర్పడిన స్టా ర్ట ర్ మున్సిపాలిటీ అయినందున, పట్టణ ప్రగతి పనుల నిమిత్తం ప్రత్యేక ఫండ్స్ (నిధులు) మంజూరు చేయడానికి ప్రాధాన్యత ఇస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# రాష్ట్రంలో తదుపరి ప్రభుత్వం బీఆర్ఎస్సే

- సత్తుపల్లిలో హరీష్రావుకు ఘన స్వాగతం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రాష్ట్రంలో ప్రజల నుంచి బీఆర్ఎస్ పార్టీకి లభిస్తున్న ఆదరణను చూస్తుంటే తదుపరి ప్రభుత్వం బీఆర్ఎస్దేనని మాజీ మంత్రి తన్నీరు హరీశ్రావు అన్నారు. అశ్వరావుపేట పర్యటనకు వెళ్తున్న సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అశ్వ రావుపేటలో నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న హరీశ్రావు కాన్వాయ్ను సత్తుపల్లి లో బీఆర్ఎస్ శ్రేణులు ఆపి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై హరీశ్రావుకు స్వాగతం తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభిమానాన్ని చాటుకున్నారు. హరీశ్రావుతో సెల్ఫీలు దిగేందుకు కార్యకర్తలు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి హరీశ్రావు మాట్లా డారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొ న్నారు.

# చెరుకుపల్లి పోడు సాగుదారులకు పట్టా లు ఇవ్వాలి

- గిరిజనులపై దాడులు ఆపాలని కలెక్ట ర్కు సీపీఐ వినతి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలో గత 40 సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరి జనులకు పట్టాలు మంజూరు చేయాలని, పోడు సాగుదారులపై జరుగుతున్న వేధింపులు, దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజనులతో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములను ఫారెస్ట్ అధికారులు బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, గిరిజనులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోడు భూములకు వెంటనే పట్టా లు మంజూరు చేసి గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గిరిజనుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదేశాలను సైతం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటి కుమారి, తాటి రాధ, గడ్డం తిరుపతమ్మ, తాటి భద్రమ్మ, పోతురాజు రాణి, వెంకటలక్ష్మి , రజిని, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు క్రీడలే ఉత్తమ మార్గం

- జిల్లా సంక్షేమ అధికారి మిల్కా



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు క్రీడలే ఉత్తమ మార్గమని జిల్లా సంక్షేమ అధికారి మిల్కా అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (నషా ముక్త్ భారత్ సప్తాహ్) సందర్భంగా మంగళవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో యువత కోసం ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ డ్రగ్స్ వంటి దురలవాట్ల నుంచి యువతను దూరంగా ఉంచడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లా సాన్ని అందిస్తాయని, యువత క్రీడల వైపు దృష్టి సారించాలని సూచించారు. యువతుల కోసం 400 మీటర్ల పరుగుపందెం, యువకుల కోసం 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం పోటీలు నిర్వహించగా, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 25న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి దయానంద్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ క్రీడల అధికారి పార్థసారథి, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సాయికుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

# తాండూర్లో పాఠశాలల బంద్ విజయవంతం

- **ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్**



**ఉద్యమ కెరటం, తాండూర్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పాఠశాలల బంద్ పిలుపు తాండూర్ మండలంలో మంగళవారం విజయవంతమైందని ఏబీవీపీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని బంద్కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 27వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23వేల పాఠశాలలను మూసివేస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులతో పాటు టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు యూనిఫాంలను తక్షణమే అందించాలని కోరారు. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ఈపీ) అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్వహిస్తున్న పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను నిషేధించాలని కోరారు. బంద్ నేపథ్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయి. బంద్కు సహకరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలకు ఏబీవీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ భాగ్ కోకన్వీనర్ సీహెచ్ ఆనంద్, మండల కన్వీనర్ ఎ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ధర్మపురి చంద్రశేఖర్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మావల గ్రామ సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్లు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మపురి చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన నాయకులకు, సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా లోని సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం కోసం జిల్లాలోని సర్పంచులందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని పేర్కొన్నారు. సర్పంచుల హక్కుల పరిరక్షణతో పాటు గ్రామీణాభివృద్ధికి మరింత ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# హామీని నిలబెట్టుకున్న సర్పంచ్ ఫక్రుద్దీన్

- **అంబేద్కర్నగర్లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరులోని అంబేద్కర్నగర్లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మహ్మద్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ మంగళవారం ప్రారంభించారు. స్థానిక ప్రజల చిరకాల కోరిక మేరకు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ఈ అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడంతో పాటు వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం కట్టుబడి ఉందన్నారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, సీసీ రోడ్డు నిర్మాణంతో ఆ సమస్యలు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి సర్పంచ్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్పై బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఎస్ఐఆర్ సర్వే నిర్వహణపై బీఎల్ఓలు, బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్, నేరడిగొండ తహశీల్దార్లు సుభాష్, ఎంఏ. కలీమ్ పాల్గొని సర్వే సందర్భంగా నింపాల్సిన ఫారాలు, వివరాల సేకరణ విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, తప్పులు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సర్వే కార్యక్రమం ఈనెల 25 నుంచి జూలై 24 వరకు కొనసాగుతుందని తెలిపారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని చెప్పారు. ఓటర్ మ్యాపింగ్లో సెల్ఫ్ మ్యాపింగ్, యాడ్ ప్రోజెనీ, సెల్ఫ్ ప్రోజెనీ అనే మూడు విధానాలు ఉన్నాయని, ఓటర్లు తమకు సంబంధించిన సరైన మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, అర్హులైన ఓటర్లందరూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ విశ్వనాథ్, ఆర్ఐ మమత, రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

- **వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు మంగళవారం కొత్తూరు రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీతో పాటు నానో ఎరువుల వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యూరియా కొరతను అధిగమించేందుకు నానో యూరియా వినియోగం ఎంతగానో ఉపయోగ ప డుతుంద ని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సరసమైన ధరలకు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చల్ల గుళ్ల కృష్ణయ్య, కొత్తూరు సర్పంచ్, ఉప సర్పంచ్, వ్యవసాయ శాఖ ఏడీ, ఏఓ, ఏఈఓ, వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ చరిత్ర పరిశోధకుడు సోనబోయిన సతీష్కు ఘన సత్కారం





**ఉద్యమ కెరటం, వరంగల్:** న్యూఢిల్లీలోని తాల్కటోరా ఇండోర్ స్టేడియంలో అఖిల్ భారతీయ కోలీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ జాతీయ మహాసభలో తెలుగు విశ్వవిద్యాలయం ముదిరాజ్ చరిత్ర పరిశోధకుడు సోనబోయిన సతీష్ ముదిరాజ్కు ఘన సత్కారం లభించింది. జాతీయ అధ్యక్షుడు వీరేంద్ర కశ్యప్ అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 1.5 లక్షల మంది ప్రతినిధులు, సభ్యులు హాజరయ్యారు. ముదిరాజ్/కోలీ సమాజ్ చరిత్రపై విశేష పరిశోధనలు చేస్తున్నందుకు సోనబోయిన సతీష్ను జాతీయ అధ్యక్షుడు వీరేంద్ర కశ్యప్ వీరాంగన ఝల్కారి బాయి స్మారక మెమెంటోతో సన్మానించారు. ఈ మహాసభలో భారత మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, హిమాచల్ ప్రదేశ్ మంత్రి డాక్టర్ ధనీరామ్ శాండిల్, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రొట్టం భూపతిరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. సమావేశంలో ముదిరాజ్/కోలీ సమాజానికి చెందిన సుమారు 15 కోట్ల జనాభా సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజ్లను ప్రస్తుతం ఉన్న బీసీ-డీ వర్గం నుంచి బీసీ-ఏ కేటగిరీలోకి మార్చాలని కీలక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్/కోలీ సమాజ్ ఐక్యత, అభివృద్ధి, హక్కుల సాధన దిశగా ఈ జాతీయ మహాసభ చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన లాయన్ కె.హనుమంతరావు, మురళీమోహన్ ముదిరాజ్, నరేష్ మహూర్, ప్రభాకర్, లాయన్ నీరటి వంశీ, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- **మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్**
- **ఎమ్మెల్యే తో కలిసి కుమార్ పేట్ లో రూ.10 లక్షల అభివృద్ధి పనులకు భూమి పూజ**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి ఆదిలాబాద్ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ అన్నారు. మంగళవారం కుమార్పేట్ పోలావార్ కాంప్లెక్స్ ప్రాంతంలో రూ.10 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహకారంతో విస్తృత ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే సుమారు రూ.100 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టి పట్టణ రూపురేఖలను మార్చనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ఇప్పటికే రూ.1.20 కోట్ల వ్యయంతో కల్వర్టులు, రోడ్ల ప్యాచ్వర్క్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అదనంగా రూ.10 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు క్రాసింగ్ పైపుల నిర్మాణ పనులు కూడా చేపడుతున్నట్లు చెప్పారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మున్సిపల్ యంత్రాంగం కూడా అవసరమైన చర్యలకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఆదిలాబాద్ను మరింత అభివృద్ధి చెందిన, ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, ఈఈ అరుణ్ కుమార్, డీఈలు, ఏఈలు, స్థానిక కౌన్సిలర్లు , మున్సిపల్ అధికారులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సమగ్ర సవరణలో రాజకీయ పార్టీల సహకారం అవసరం

- **ఎలాంటి పొరపాట్ల కు తావులేకుండా ప్రక్రియ నిర్వహించాలి**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25 నుంచి జూలై 24 వరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసి, తిరిగి వాటిని సేకరించి వివరాలను యాప్లో నమోదు చేస్తారని వివరించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని, తహశీల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ స్థాయి ఏజెంట్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- వంజరి కాలనీలో తాగునీటి బోర్ను ప్రారంభించిన ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, బోథ్:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం స్థానిక వంజరి కాలనీను సందర్శించి నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోర్బావిని ప్రారంభించారు. ఇటీవల వంజరి సంఘం ప్రతినిధులు ఆడే గజేందర్ను కలిసి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు ఇతర మౌలిక వసతుల కొరతను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులకు ఇచ్చిన హామీ మేరకు ఎస్డీఎఫ్ నిధుల ద్వారా కొత్త బోర్బావిను మంజూరు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం వంజరి సంఘం సభ్యులు మాట్లాడుతూ తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించి బోర్ మంజూరు చేయడంతో పాటు స్వయంగా కాలనీను సందర్శించి సమస్యలను తెలుసుకున్న ఆడే గజేందర్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ కాలనీలో మిగిలిన మౌలిక సదుపాయాల సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, ఆత్మ డైరెక్టర్ రహిమొద్దీన్, సన్నీ రెడ్డి, వార్డు సభ్యులు పద్మరావు, శ్రీనివాస్, శంషోద్దీన్, వంజరి సంఘం సభ్యులు మల్లేష్, చరణ్, దీపు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగు పనులను అడ్డుకుంటే ఊరుకోం

## డీఎఫ్ఓ కార్యాలయం ఎదుట పోడు రైతుల ఆందోళన

## ఎమ్మెల్యే కోవా లక్ష్మి సంఘీభావం



**ఉద్యమ కెరటం, జైనూర్:** పోడు భూముల్లో సాగు పనులను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్, కెరమెరి మండలాలకు చెందిన పోడు రైతులు జిల్లా కేంద్రంలోని డీఎఫ్ఓ కార్యాలయం ఎదుట మంగళవారం భారీ ఆందోళన చేపట్టారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆందోళనకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి సంఘీభావం ప్రకటించారు. రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పోడు భూముల్లో సాగు చేస్తున్న రైతులను అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూముల్లో వ్యవసాయ పనులను అడ్డుకోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పోడు రైతుల హక్కులను పరిరక్షించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వారికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పోడు భూముల్లో సాగు పనులను అడ్డుకుంటే సహించబోమని హెచ్చరించారు. తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఆందోళనలో జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్, కెరమెరి మండలాలకు చెందిన పోడు రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యాసన ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు తమ పరిధిలోని పాఠశాలలను ప్రతిరోజూ సందర్శించి విద్యార్థులు చదవడం, రాయడం, మాట్లాడడం వంటి నైపుణ్యాలను పరిశీలించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాల్లో చర్చించిన అంశాలపై నివేదికలు రూపొందించి, ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, బోధన విధానం, పఠన సామర్థ్యాలు, ఫలితాల సాధన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. నిర్మాణాత్మక చర్యల ద్వారా విద్యా నాణ్యతను పెంచి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల బదిలీ ధ్రువపత్రాల విషయంలో సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఉపాధ్యాయులకు సాధ్యమైనంత వరకు బోధన సంబంధిత విధులనే కేటాయించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు, యూడైస్ వివరాల నమోదు, బోధనేతర సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు, బోధనేతర సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ధృవీకరించిన విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలి

- అంకోలిలో విత్తన మేళాను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పంట సాగు కోసం ధృవీకరించిన విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. వానకాలం పంటల సాగు నేపథ్యంలో రైతులకు నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తనాలను అందుబాటులో ఉంచే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న విత్తన మేళాను మంగళవారం అంకోలి రైతు వేదికలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 86 రైతు వేదికల ద్వారా వికేంద్రీకృత పద్ధతిలో విత్తనాల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. విత్తన మేళా ద్వారా సోయాబీన్ 1,273.015 క్వింటాళ్లు, కంది 147.73 క్వింటాళ్లు, పెసర 30.44 క్వింటాళ్లు, మినుము 22.17 క్వింటాళ్లు, నానో యూరియా 3,053 సీసాలు, నానో డీఏపీ 1,965 సీసాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తన శుద్ధి విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 23 నుంచి వారం రోజుల పాటు విత్తన మేళాలు కొనసాగుతాయని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా పట్టా దారు పాసుబుక్, లేనియెడల ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. అలాగే కొనుగోలు చేసిన ప్రతి విత్తన బస్తాకు సంబంధించి డీలర్ నుంచి నగదు రశీదు తీసుకోవాలని తెలిపారు. అనధికారిక డీలర్లు సర్టిఫికేషన్ లేని, చట్ట విరుద్ధమైన విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖలతో కూడిన ప్రత్యేక టాస్క్ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయని, నకిలీ విత్తనాల విక్రయదారులపై సీడ్స్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత

- మామిడిగూడలో వివో భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న వీవో భవన నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా గ్రామాల్లో అన్ని వసతులతో కూడిన సంఘ భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. మామిడిగూడలో చేపట్టిన వీవో భవన నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను మహిళా సంఘాల ప్రతినిధులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. మహిళలు ఒకేచోట సమావేశమై సంఘాల కార్యకలాపాలు, అభివృద్ధి ప్రణాళికలపై చర్చించుకునేందుకు ఈ భవనాలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రిజిస్టర్ను పరిశీలించి, అందిస్తున్న వైద్య సేవలపై అధికారుల ద్వారా అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో



తహశీల్దార్ గోవింద్, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలే పారిశుద్ధ్య కార్మికులు..!

- బాలాజీ నగర్లో స్వయంగా మురికి కాలువలు శుభ్రం చేస్తున్న కాలనీవాసులు





**ఉద్యమ కెరటం, జైనూర్:** వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ బాలాజీ నగర్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడం, రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోవడంతో సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో స్థానికులే స్వయంగా శుభ్రత పనులు చేపట్టారు. కాలనీలోని పలు వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమల బెడద పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య లోపంతో ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. మురికి కాలువలను శుభ్రం చేస్తూ కాలనీవాసులు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోవాల్సిన అధికారులు స్పందించకపోవడంతో తామే పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి వస్తోందని వాపోయారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురికి కాలువలను పూర్తిగా శుభ్రం చేయాలని పేర్కొన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ
- బడిబాటలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**ఉద్యమ కెరటం, జైనూర్:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. మండలంలోని రాశిమెట్ట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లి విద్యార్థులను పాఠశాలలకు తీసుకురావడం, తల్లిదండ్రులకు విద్య అవసరాన్ని వివరించడం వంటి అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో విద్యారంగానికి కొత్త ఊపు వచ్చిందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన తాను, విద్యాభివృద్ధి, గిరిజన ప్రాంతాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, డీసీసీ ఉపాధ్యక్షుడు తారీఖ్, డీసీసీ జనరల్ సెక్రటరీ గాదవేణి మల్లేష్, మైనార్టీ నాయకుడు సఫన్, రాశిమెట్ట సర్పంచ్ ఉయిక చందు, భూసిమెట్ట సర్పంచ్ దుర్వ సింధు నాగేష్, చింతకర్ర సర్పంచ్ విఠల్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద
- చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** చెన్నూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం కోటపల్లి మండలంలోని లింగన్నపేట, ఏదులబంధం, సిర్స, రొయ్యలపల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్థానిక అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని తెలిపారు. పలు గ్రామాల్లో ఎస్డీఎఫ్, డీఎంఎఫ్టీల ద్వారా అదనపు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గంలో రెండు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రూ.200 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు, రూ.100 కోట్లతో అమృత్ 2.0 పథకం ద్వారా తాగునీటి సదుపాయాల విస్తరణ చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధి అవకాశాల కల్పన కోసం రూ.46 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చర్యలు కొనసాగుతున్నాయని, వృత్తి విద్యతో పాటు విదేశీ ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వైద్య రంగ బలోపేతం కోసం చెన్నూర్లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో ప్రారంభించనున్నామని, మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి సంస్థ లాభాల్లో కొనసాగుతోందని, ఇసుక మాఫియా నియంత్రణకు సీసీ కెమెరాలు, వేబ్రిడ్జిల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు. అలాగే "సే నో టు డ్రగ్స్" కార్యక్రమంలో భాగంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వేదికపై ఆసిఫాబాద్ ఆణిముత్యం 'శైనిశ్రీ'..

## వరల్డ్ కప్ ప్రయాణానికి కావాలి ఆర్థిక సాయం!

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**
ఆమె నిరుపేద కుటుంబంలో పుట్టి నా, ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసింది. సరైన వసతులు లేకపోయినా, పట్టుదలే పెట్టుబడిగా సాఫ్ట్ బేస్‌బాల్ క్రీడలో అసాధారణ ప్రతిభను కనబరుస్తోంది. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి జిల్లా పేరును ప్రపంచ పటంలో నిలిపిన ఆ క్రీడాకారిణి, ఇప్పుడు శ్రీలంకలో జరగబోయే వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైంది. కానీ, ఆమె కలల ప్రయాణానికి పేదరికం పెద్ద అడ్డుగోడగా మారింది. ప్రభుత్వం, దాతలు స్పందించి ఆర్థిక సహాయం అందిస్తే, అంతర్జాతీయ వేదికపై దేశ పతాకాన్ని ఎగరవేస్తానని ఆ క్రీడాకారిణి వేడుకుంటోంది.



**గోల్డ్ మెడల్‌తో దేశానికి వన్నె తెచ్చి..**

కాగజ్‌నగర్ మండలం వంజీరి గ్రామానికి చెందిన దుర్గం కృష్ణ – సునీత దంపతుల కుమార్తె దుర్గం శైనిశ్రీ. ప్రస్తుతం ఆమె సిర్పూర్ (టి) లోని డి.పి.ఐ.పి పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్న శైనిశ్రీ, సాఫ్ట్ బేస్‌బాల్‌ను కెరీర్‌గా ఎంచుకుంది. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలలో రజత పతకం (సిల్వర్ మెడల్) సాధించి తొలిసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత మరింత పట్టుదలతో శ్రమించి, జూలై 10 నుండి 14 వరకు నేపాల్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలలో అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకం (గోల్డ్ మెడల్) కైవసం చేసుకుంది. తద్వారా అటు దేశానికి, ఇటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకు వచ్చింది.

**సెప్టెంబర్‌లో శ్రీలంక వరల్డ్ కప్ పోటీలకు ఎంపిక..**

నేపాల్‌లో చూపిన అద్భుత ప్రతిభ ఆధారంగా, రాబోయే సెప్టెంబర్ నెలలో శ్రీలంకలో నిర్వహించనున్న 'వరల్డ్ కప్ సాఫ్ట్ బేస్‌బాల్' పోటీలకు శైనిశ్రీ అధికారికంగా ఎంపికైంది. ప్రపంచ స్థాయి అత్యున్నత పోటీలలో పాల్గొనే సువర్ణ అవకాశం రావడం పట్ల జిల్లా క్రీడాకారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కలలకు అడ్డు పడుతున్న పేదరికం**

శైనిశ్రీ తండ్రి కృష్ణ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజువారీ వచ్చే అరకొర ఆదాయంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉన్న తరుణంలో, కూతురిని శ్రీలంకలో జరిగే వరల్డ్ కప్ పోటీలకు పంపించడం ఆ కుటుంబానికి పెద్ద భారంగా మారింది. పాస్‌పోర్ట్, ప్రయాణ ఖర్చులు, కిట్, వసతి వంటి ఖర్చులకు పెద్ద మొత్తంలో డబ్బు అవసరం ఉండటంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. మంగళవారం జిల్లా కేంద్రంలో పత్రికా విలేకరులతో శైనిశ్రీ మాట్లాడుతూ.. తన తండ్రి ఆటో డ్రైవర్ అని, అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు అయ్యే ఖర్చులను భరించే స్తోమత తమకు లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగంతో పాటు దాతలు పెద్ద మనసుతో స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని, శ్రీలంక వరల్డ్ కప్‌లో దేశానికి మెడల్ తీసుకువచ్చి రుణం తీర్చుకుంటానని కన్నీటి పర్యంతమై వేడుకుంది.

**దాతలు సహాయం చేయాల్సిన ఫోన్ పే నంబర్ 9515630521**

ప్రతిభ ఉండి, దేశానికి కీర్తి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈ గిరిజన జిల్లా బిడ్డకు సహాయం చేయాలనుకునే దాతలు కింద పేర్కొన్న ఫోన్ పే నంబర్ ద్వారా నేరుగా ఆర్థిక సహాయం అందించవచ్చు. క్రీడల్లో ఇంతటి ప్రతిభ కనబరుస్తున్న శైనిశ్రీని స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు ప్రత్యేకంగా గుర్తించి, ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సహాయం అందించి విదేశాల్లో జరిగే వరల్డ్ కప్‌కు వెళ్లేలా ప్రోత్సహించాలని జిల్లా క్రీడాభిమానులు కోరుతున్నారు.

## ఆశపల్లి యువకుడు మోరే సచిన్కు ఇండియన్ నేవీలో ఉద్యోగం

**ఉద్యమ కెరటం, జైనూర్:**
మండలంలోని ఆశపల్లి గ్రామానికి చెందిన మోరే విజయ్ కుమారుడు మోరే సచిన్ ఇండియన్ నేవీ ఎస్సార్ విభాగంలో ఉద్యోగానికి ఎంపికైనట్లు మాంగ్ సమాజ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మావాలే దత్త మాంగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామానికి చెందిన ఒక దళిత యువకుడు కష్టపడి చదివి భారత నౌకాదళంలో ఉద్యోగం సాధించడం అభినందనీయమని కొనియాడారు. సచిన్ సాధించిన విజయం ఆశపల్లి గ్రామానికే కాకుండా జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు. మోరే సచిన్కు జూలై 15వ తేదీ నుంచి ఒడిశాలో తొమ్మిది నెలలపాటు ప్రత్యేక నేవీ శిక్షణ ఉన్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయిన అనంతరం దేశ సేవలో భాగంగా తన విధులను నిర్వహించనున్నాడని పేర్కొన్నారు. యువత సచిన్ను ఆదర్శంగా తీసుకుని విద్య, క్రమశిక్షణ, కఠోర శ్రమతో తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉద్యోగాల సాధన కోసం యువత పట్టుదలతో ముందుకు సాగాలని, సమాజ అభివృద్ధికి తమవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మోరే సచిన్ ఇండియన్ నేవీలో ఎంపిక కావడం పట్ల ఆశపల్లి గ్రామ మాంగ్ సమాజ్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




## ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక

**ఉద్యమ కెరటం,సంగారెడ్డి :**
ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను విశ్లేషించి వాటి పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లాకు ప్రత్యేక అధికారిణిగా నియమితులైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జడ్ చోంగ్తు అధికారులను ఆదేశించారు.మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలు, పురోగతిపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డా. క్రిస్టినా జడ్ చోంగ్తు మాట్లాడుతూ ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా అమలు చేసినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రజల నుంచి అందిన వినతులు, సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలపై శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచిన కార్యక్రమాలు, ప్రజల నుంచి మంచి స్పందన పొందిన పథకాలను గుర్తించి భవిష్యత్తులో మరింత విస్తృతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేసిన అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించి, సమస్యల పరిష్కారానికి మెరుగైన ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. శాఖల స్థాయిలో పరిష్కరించగల సమస్యలు, ఇతర శాఖల సమన్వయం అవసరమైన అంశాలు, ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను వేర్వేరుగా గుర్తించి జిల్లా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో గుర్తించిన సమస్యలను మూడు విభాగాలుగా వర్గీకరించామని తెలిపారు. ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, మిగిలిన సమస్యలకు జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పరిష్కార చర్యలు చేపడతామని వివరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.




## స్కూటీ పార్కింగ్‌పై గొడవ.. వ్యక్తిపై రాయి, కర్రతో దాడి

- అడ్డు కున్న భార్యపై కూడా దాడి..
- తండ్రి-కొడుకుల దాడి.. భార్యాభర్తలకు గాయాలు
- కుషాయిగూడలో కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభం

**ఉద్యమ కెరటం,కాప్రా :**
పార్కింగ్ విషయంలో జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసి, ఓ వ్యక్తిపై తండ్రి–కొడుకులు దాడి చేసిన ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో బాధితుడితో పాటు అడ్డుకునేందుకు వెళ్లిన ఆయన భార్య కూడా గాయపడగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టా రు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రాకు చెందిన మేరీ భర్త నరసింహారావు (40) తన కుమార్తె ప్రసిల్లా (11), స్నేహితురాలి కుమార్తె ఆరాధ్య (2)తో కలిసి మంగళవారం మధ్యాహ్నం విజయ స్కూల్ సమీపంలోని ఐస్‌క్రీం దుకాణానికి వెళ్లారు. కొంతసేపటి తర్వాత కూడా ఇంటికి రాకపోవడంతో మేరీ ఫోన్ చేయగా, వెంటనే సంఘటన స్థలానికి రావాలని నరసింహారావు తెలిపారు.అక్కడికి చేరుకున్న మేరీ, ఇద్దరు వ్యక్తులు తన భర్తపై దాడి చేస్తున్నట్లు గమనించింది. ఏమైందని ప్రశ్నించగా వారు అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు, నరసింహారావుపై సిమెంట్ రాయి, కర్రతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మేరీపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు.స్థానికుల సహకారంతో గాయపడిన నరసింహారావును సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడి చేసిన వారు అర్జున్, సుబ్బారావు అనే తండ్రి–కొడుకులని బాధితులు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.ప్రాథమిక విచారణలో స్కూప్ షాప్ సమీపంలో నరసింహారావు తన స్కూటీని పార్క్ చేయడం వల్ల నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతోందనే కారణంతో ఈ దాడి జరిగినట్లు తెలిసిందన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కుషాయిగూడ ఎస్ఐ ఎన్. వెంకన్న తెలిపారు.

## డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు దేశ సమైక్యతకు మార్గదర్శకం

- బలిదాన్ దివస్ సందర్భంగా ఘన నివాళులర్పించిన బీజేపీ నాయకులు

**ఉద్యమ కెరటం,ఘట్‌కేసర్ :**
భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, మహోన్నత జాతీయవాది డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను ఘట్‌కేసర్ 6వ డివిజన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎఫ్‌సీ నగర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, దేశ సమైక్యత, అఖండ భారత నిర్మాణం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశం పట్ల ఆయన చూపిన అంకితభావం, జాతీయత పరిరక్షణకు చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమానికి ఘట్‌కేసర్ 6వ డివిజన్ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం నాయకులు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు కాలేరు రామోజీ, పల్లె మధుసూదన్, పడిగెం వీరేశం, గుండ్ల రామతీర్థం, చెల్లక శ్రీధర్, మంగు రాధిక, కట్ట మధుసూదన్ రెడ్డి, బండ్లగూడం కిషోర్ గౌడ్, గడీల శశికాంత్ రెడ్డి, మంగు శ్రీనివాస్ రావు, మమతా శర్మ, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

- అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దు
- అధికారులందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశం



**ఉద్యమ కెరటం,కూకట్‌పల్లి:**
భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీ, శ్రీల గార్డెన్, శ్రీరంగపురం, డైనమిక్ కాలనీ, హైటెన్షన్ లైన్ రోడ్, శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలలో ఏర్పడిన ముంపు సమస్యలను సీఎంసీ కమిషనర్ సృజన, డీసీ బాలకృష్ణ, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ వరద నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. సీఎమ్‌సీ, హైడ్రా, మాన్‌సూన్ ఎమర్జెన్సీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**వర్ష కాలంలో విద్యుత్ జాగ్రత్తలు:**

వరదలు, వానల సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు స్వయం నియంత్రణ పాటించాలని గాంధీ కోరారు. తడిసిన కరెంట్ స్తంభాలు, మోటార్లు, స్విచ్ బోర్డులు, చెట్లకు తగులుతున్న వైర్లను ముట్టు కోవద్దన్నారు. వర్షం పడేటప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ల స్విచ్‌లు ఆఫ్ చేసి, డిష్ కనెక్షన్లు తొలగించాలని సూచించారు. తెగిన వైర్లు కనిపిస్తే తక్షణమే జేఎల్ఎమ్, ఏఈ వంటి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఎస్ఈ శ్రీకాంతిని, ఈఈ గోవర్ధన్, డీఈ దుర్గ ప్రసాద్, డీఈ రూపదేవి, డీజీఎమ్ నారాయణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

- దాతృత్వంతో ప్రశంసలు అందుకున్న నెర్మటి శ్రీనివాస్–ఝాన్సీ రెడ్డి



**ఉద్యమ కెరటం,మాడుగులప**
మండలంలోని చెరువుపల్లి గ్రామంలో మంగళవారం నెర్మటి పద్మమ్మ–సత్తిరెడ్డి దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుమారుడు, కోడలు నెర్మటి శ్రీనివాస్–ఝాన్సీ రెడ్డి దంపతులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తమ ఆర్థిక సహకారంతో గ్రామ ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయానికి అవసరమైన ఫర్నిచర్‌ను అందజేసి గ్రామ పాలనకు తమ వంతు సహకారం అందించారు. గ్రామంలోని గంగదేవమ్మ జాతర సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం దేవతా విగ్రహాల ఏర్పాటుతో పాటు ఆలయ గోడలకు పెయింటింగ్ పనులను చేపట్టించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు నెర్మటి శ్రీనివాస్–ఝాన్సీ రెడ్డి దంపతుల సేవా దృక్పథాన్ని అభినందించారు. విద్య, గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వారు అందిస్తున్న సహాయం ఆదర్శప్రాయమని కొనియాడారు. గ్రామాభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి, ఉపసర్పంచ్ మానుపాటి వినోద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రభుదాస్, దేవిక, వార్డు సభ్యురాలు మానుపాటి శిరీష, గుర్రం వెంకట్ రెడ్డి, గొర్రె అశోక్ రెడ్డి, ఇటికాల జాన్ రెడ్డి, చెరుకుపల్లి రాజు, మర్రి నాగరాజు, దేప జగన్ రెడ్డి, ఇటికాల శేఖర్ రెడ్డి, డాక్టర్ శీను, కట్ట రంజిత్ రెడ్డి, ఉప్పు బంగారు, ముదిరెడ్డి యాదగిరి రెడ్డి, సీహెచ్ యాదయ్య, ఉపాధ్యాయ బృందం, శ్రీనివాస్ రెడ్డి బాల్యమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**జేఎన్‌టీయూ, ధర్మారెడ్డి ఫీడర్ల పరిధిలో అంతరాయం**

**చెట్ల కొమ్మల నరికివేత, లైన్ల నిర్వహణ పనుల కోసమే: ఏఈ**

**ఉద్యమ కెరటం,కూకట్‌పల్లి, :**
అత్యవసర లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల నరికివేత పనుల కారణంగా ఈరోజు కేపీహెచ్‌బీ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్‌అసిస్టెంట్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 09:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జేఎన్‌టీయూ ఫీడర్ పరిధిలోని ఎమ్ఆర్ఓ ఆఫీస్, ఈడబ్ల్యూఎస్ రోడ్, పోస్ట్ ఆఫీస్, చాకలి డబ్బా ఎల్ఐజీ, శివాలయం రోడ్, మహారాష్ట్ర బ్యాంక్ ఎదురు లైన్, గ్లోబల్ స్కూల్ రోడ్, ఆర్ఆర్ చికెన్ సెంటర్ రోడ్, ఎల్ఐజీ–302 నుంచి 384 వరకు, ధనలక్ష్మి సెంటర్ ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుంది. మధ్యాహ్నం 14:30 గంటల నుంచి సాయంత్రం 17:00 గంటల వరకు ధర్మారెడ్డి ఫీడర్ పరిధిలోని ఎమ్ఆర్ఓ ఆఫీస్ పరిసరాలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ధర్మారెడ్డి పార్క్, ఐసీఐసీఐ బ్యాంక్, పూజ ఎలక్ట్రికల్ షాప్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనుంది. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు.

# టెస్టు కెప్టెన్సీకి టైమొచ్చింది..

## స్వదేశంలో ఎంగరవాకు తొలి పరీక్ష!



జింబాబ్వేకు వన్డేల్లో సారథ్యం వహిస్తున్న రిచర్ప్ ఎంగరవా(=అవ్షుఙతీస చీస్రుఙతీఖజుఖ) టెస్టుల్లోనూ జట్టును నడిపించనున్నాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో ఏకైక టెస్టుకోసం స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు ఎంగరవాను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడికిదే తొలి పరీక్ష. స్వదేశంలో జూన్ 28న మొదలయ్యే ఈ మ్యాచ్‌తో జట్టును గెలుపు దిశగా నడిపించేందుకు సిద్ధమవుతున్నాడీ పొడగరి పేసర్. ఏకైక టెస్టుకోసం ఎంపిక చేసిన 15మంది బృందంలో స్టార్ ఆల్‌రౌండర్ సికిందర్ రజాకు చోటు దక్కలేదు. ఇంగ్లండ్ వేదికగా జరిగే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు రజా కట్టుబడి ఉండడంతో అతడిని పక్కన పెట్టేశారు. నిరుడు ఏప్రిల్ -- మే నెలలో జింబాబ్వే, బంగ్లాదేశ్ రెండు టెస్ట్‌ల్లో తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో జింబాబ్వే మూడు వికెట్ల విజయం సాధించింది. కానీ, రెండో మ్యాచ్‌లో గెలుపొందిన బంగ్లా సిరీస్‌ను సమం చేసి పరువు కాపాడుకుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఇరుజట్లు ఏకైక టెస్టులో విజయంపై కన్నేశాయి. జూన్ 28న హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో మ్యాచ్ జరుగనుంది.

**జింబాబ్వే స్క్వాడ్ :** రిచర్డ్ ఎంగరవా(కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, తనకా చివంగా, గ్రేమీ క్రెమర్, క్రేగ్ ఎర్విన్, బ్రాడ్ ఎవాన్స్, ఇన్నోసెంట్ కైయా, రాయ్ కైయా, వెస్లీ మధెవెరె, తడివనషె మరుమని, బ్లెస్సింగ్ ముజరబని, న్యూమాన్ న్యామ్‌హురి, బ్రెండన్ టేలర్, తఫద్జ్వ త్సిగా.



# ఐర్లాండ్ సిరీస్‌కు నితీశ్ కుమార్ రెడ్డి దూరం

**ముంబై, జూన్ 23 :** భారత ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా అతను జట్టుకు అందుబాటులో లేకుండా పోయినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఫీల్డ్ చేస్తూ గాయపడిన నితీశ్, అనంతరం జరిగిన పరీక్షల్లో ఎడమ కాలి కండరంలో వాపు ఉన్నట్లు ఎంఆర్ఐ స్కానింగ్‌లో తేలింది. ప్రస్తుతం అతను బెంగళూరులోని సీఓఈలో వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నాడు. పూర్తిగా కోలుకోవడానికి కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని వైద్యులు అంచనా వేస్తున్నారు. అయితే గాయం తీవ్రతను బట్టి ఈ గడువు మరింత పెరిగే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం. ఇక నితీశ్ స్థానంలో యువ ఆటగాడు సూర్యాన్ష్ షెడ్జ్‌ను ఎంపిక చేసినట్లు జట్టు మేనేజ్‌మెంట్ తెలిపింది. ఇటీవల ఇండియా-ఏ జట్టులో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సూర్యాన్ష్, శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు చేశాడు. అలాగే ముంబై జట్టు తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 251 స్ట్రైక్ రేటుతో 131 పరుగులు చేసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.

# అమ్మ నగలు అమ్మి క్రికెట్ కిట్ కొనిచ్చింది

## క్రాంతి గౌడ్ భావోద్వేగం





**న్యూఢిల్లీ, జూన్ 23 :** టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ క్రాంతి గౌడ్ తన క్రికెట్ ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలు, కుటుంబం చేసిన త్యాగాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తన క్రికెట్ కిట్ కోసం తన తల్లి నగలు అమ్మి సహాయం చేసిందని ఆమె వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన తాను అంతర్జాతీయ స్థాయికి చేరడం సులభం కాలేదని క్రాంతి తెలిపారు. చిన్న వయసులోనే గ్రామంలో ఆడపిల్లలు బయటకు రావడానికే విమర్శలు ఎదుర్కొనేవారని, అయినా కష్టపడి సాధన కొనసాగించినట్లు చెప్పారు. కుటుంబ మద్దతు తన కెరీర్‌కు పెద్ద బలమని ఆమె స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తన కలను నమ్మి ఎప్పుడూ ప్రోత్సహించారని, ఆర్థిక ఇబ్బందుల సమయంలో తల్లి తన నగలు అమ్మి క్రికెట్ కిట్ కొనిచ్చిన ఘటనను ఆమె భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. ఇంగ్లండ్ పర్యటనలో ఒక మ్యాచ్‌లో 52 పరుగులకు 6 వికెట్లు తీసి ఆమె అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ప్రపంచకప్‌లో రాణించడంతో తన స్వగ్రామంలో క్రికెట్ అకాడమీ ఏర్పడిందని క్రాంతి ఆనందం వ్యక్తం చేశారు. తనను చూసి గ్రామంలోని మరెంతో మంది అమ్మాయిలు క్రికెట్‌లోకి వస్తుండటం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.



## 'పద్మ శ్రీ' అవార్డు అందుకున్న

# రోహిత్ శర్మ..

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 'పద్మశ్రీ' అవార్డు అందుకున్నాడు. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము (ణతీశీబజుఖుసఱ వీబతీఎబ) చేతుల మీదుగా హిట్‌మ్యాన్ ఈ పురస్కారాన్ని స్వీకరించాడు. వ్యక్తిగత కారణాలతో తొలి విడతలో పద్మ అవార్డు వేడుకకు దూరమైన రోహిత్.. ఈసారి హాజరయ్యాడు. నలుపు రంగు సూట్ ధరించిన మాజీ సారథి.. రాష్ట్రపతి ముర్ము నుంచి పద్మ శ్రీ అవార్డును తీసుకోవడం చూసి అతడి భార్య రితికా సచ్‌దేహ్ తెగ సంబురపడిపోయింది. టీమిండియాకు పొట్టి ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ కట్టబెట్టినందుకు రోహిత్ శర్మ పద్మ శ్రీకి ఎంపికయ్యాడు. భారత క్రికెట్‌కు విశేష సేవలందించినందున అతడిని కేంద్ర ప్రభుత్వం అతడిని ఈ పురస్కారంతో గౌరవించింది. మే 25 న భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి హిట్‌మ్యాన్ పద్మ శ్రీని స్వీకరించాల్సింది. కానీ, వ్యక్తిగత కారణాలతో అప్పుడు దూరమైన రోహిత్.. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ఈ అవార్డును స్వీకరించాడు. నలుపు రంగు సూట్‌లో వచ్చిన రోహిత్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నమస్కరించి పురస్కారం అందుకున్నాడు. అవార్డు తీసుకునేందుకు వెళ్తే.. తిరిగి వచ్చే క్రమంలోనూ రోహిత్ ప్రధాని నరేంద్ర మోడీకి నమస్కరించాడు. టీ20లు, టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ ప్రస్తుతానికి వన్డేల్లోనే ఆడుతున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న మాజీ సారథి ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన విషయం తెలిసిందే. క్రీడా విభాగంలో పద్మ శ్రీకి ఎంపికైన హాకీ ప్లేయర్ సవితా పూనియా సైతం ఇదే వేడుకలో అవార్డును స్వీకరించారు. టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ భూషణ్ అవార్డును అందుకున్నారు.



# శ్రీలంకకు చావోరేవో..

## ఐర్లాండ్ బోణీ కొట్టేనా..!



మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో నిరాశపరుస్తున్న శ్రీలంక కీలక మ్యాచ్‌కు సిద్ధమైంది. సెమీస్ ఆశలు సంక్లిష్టంగా మారిన వేళ చావోరేవే పోరులో ఐర్లాండ్‌ను ఢీ కొడుతోంది. కౌంటీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో లంక కెప్టెన్ చమరి ఆటపట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఆడిన మూడు మ్యాచుల్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించిన ఐర్లాండ్ పోతూ పోతూ లంక అవకాశాల్ని దెబ్బతీయాలనుకుంటోంది. గ్రూప్ బీలోని శ్రీలంక మూడు మ్యాచుల్లో ఒకే విజయంతో సెమీస్ రేసులో వెనకబడింది. హ్యాట్రిక్ విజయాలు సాధించిన వెస్టిండీస్, ఇంగ్లండ్ ఆరేసి పాయింట్లతో టాప్-2లో నిలవగా.. స్కాట్లాండ్‌ను ఓడించిన న్యూజిలాండ్ మూడో స్థానం దక్కించుకుంది. ఇప్పటికే మూడు ఓటములతో టోర్నీ నుంచి వైదొలిగిన ఐర్లాండ్.. లంకపై విజయంతో ఖాతా తెరవాలనే కసితో ఉంది.



**శ్రీలంక తుది జట్టు :** చమరి ఆటపట్టు(కెప్టెన్), ఇమేష దులానీ, హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, హన్సిమ కరుణరత్నే, కవిష దిల్హారి, నీలాక్షిక సిల్వా, కౌషాని నుత్యాంగన(వికెట్ కీపర్), సుగంధ కుమారి, నిమష మీపగే, మిథాలీ అయోధ్య.

**ఐర్లాండ్ తుది జట్టు :** అమీ హంటర్(వికెట్ కీపర్), గబి లెవిస్(కెప్టెన్), ఒర్లా ప్రెండెర్గాస్ట్, రెబెక్కా స్టోకెల్, లూయిస్ లిటిల్, లీహ్ పాల్, అలిసే టెక్టర్, అర్లెనా కెల్లీ, ఐమీ మగీరే, కారా ముర్రే, లారా మెక్‌బ్రైడ్.

## శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో

# ఇంగ్లండ్ టూర్‌కు యువ భారత జట్టు సిద్ధం

**న్యూఢిల్లీ, జూన్ 23 :** టీ20 ప్రపంచకప్ విజయానంతరం భారత క్రికెట్ జట్టు మరో కీలక విదేశీ పర్యటనకు సిద్ధమైంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని యువ జట్టు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటన కోసం బయల్దేరింది. ఈ పర్యటనలో భారత్ తొలుత ఐర్లాండ్‌తో డబ్లిన్‌లో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. అనంతరం ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లు జరగనున్నాయి. ఇది టీ20 ప్రపంచకప్ తర్వాత భారత జట్టు ఆడుతున్న తొలి ద్వైపాక్షిక టీ20 సిరీస్ కావడం విశేషం. ఈ పర్యటనలో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ జట్టులోకి ఎంపికై ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తూ అత్యంత పిన్న వయస్కుడిగా భారత సీనియర్ జట్టులో చోటు సంపాదించడం విశేషం. అలాగే ప్రిన్స్ యాదవ్ కూడా తొలిసారి టీ20 జట్టులోకి వచ్చాడు. వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తిరిగి జట్టులోకి రానున్నాడు. సిరాజ్ స్థానంలో ప్రసిధ్ కృష్ణను జట్టులోకి తీసుకోగా, హర్షిత్ రాణా మరియు రవి బిష్ణోయ్ కూడా తిరిగి జట్టులో చోటు దక్కించుకున్నారు. టీ20 సిరీస్ జూలై 1 నుంచి 11 వరకు జరగనుండగా, వన్డే సిరీస్ జూలై 14 నుంచి 19 వరకు కొనసాగనుంది.





# విజయ్-త్రిషపై మళ్లీ ఊహాగానాలు

కోలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన తెరజంటల్లో దళపతి విజయ్, త్రిష జోడీకి ప్రత్యేక స్థానం ఉంది. పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించిన ఈ ఇద్దరి మధ్య ఉన్న తెరపై కెమిస్ట్రీ ఎప్పుడూ అభిమానులను ఆకట్టుకుంది. అయితే గత కొంతకాలంగా వీరి వ్యక్తిగత అనుబంధంపై కూడా సామాజిక మాధ్యమాల్లో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. తాజాగా విజయ్ పుట్టినరోజు సందర్భంగా త్రిష ఎలాంటి శుభాకాంక్షల సందేశం పెట్టకపోవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దీంతో వీరిద్దరి మధ్య ఏమైనా దూరం పెరిగిందా అనే అనుమానాలు అభిమాన వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా విజయ్, త్రిషలు పలు కార్యక్రమాల్లో కలిసి కనిపించడం, ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వడం, వ్యక్తిగత వేడుకల్లో హాజరవడం వంటి పరిణామాలు అభిమానుల్లో ఆసక్తి పెంచాయి. ఈ క్రమంలో వీరిద్దరి స్నేహం కేవలం సహనటుల సంబంధాన్ని మించి ఉండొచ్చని సామాజిక మాధ్యమాల్లో ఎన్నో కథనాలు వెలువడ్డాయి. అదే సమయంలో విజయ్ వ్యక్తిగత జీవితంపై కూడా పలు ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ అంశాలపై విజయ్ గానీ, త్రిష గానీ ఎప్పుడూ బహిరంగంగా స్పందించలేదు. అధికారిక ప్రకటనలేమీ లేకపోయినా, వీరి గురించి వచ్చే ప్రతి చిన్న పరిణామం అభిమానుల్లో పెద్ద చర్చకు దారి తీస్తూనే ఉంది. ఈసారి విజయ్ పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక మాధ్యమాలు విజయ్‌కు సంబంధించిన పోస్టులు, చిత్రాలు, వీడియోలతో నిండిపోయాయి. ఇలాంటి సమయంలో ప్రతి ఏడాది విజయ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెప్పే త్రిష ఈసారి పూర్తిగా మౌనం పాటించడం అందరి దృష్టిని ఆకర్షించింది. త్రిష సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తరచూ తన చిత్రాల అప్‌డేట్లు, వ్యక్తిగత ఫొటోలు పంచుకుంటూ ఉంటారు. అలాంటి త్రిష విజయ్ పుట్టినరోజు వంటి సందర్భంలో స్పందించకపోవడంతో అభిమానుల్లో పలు రకాల వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారాల ప్రకారం విజయ్ ప్రస్తుతం తన కుటుంబ జీవితం, రాజకీయ బాధ్యతలపై మరింత దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో త్రిష కూడా వ్యక్తిగత అంశాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తూ కొంత దూరం పాటిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ఇప్పటివరకు కేవలం ప్రచారాలుగానే మిగిలాయి. విజయ్ లేదా త్రిష తరఫున ఎలాంటి స్పష్టత రాకపోవడంతో నిజానిజాలు తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు అభిమానులు త్రిష ఈసారి శుభాకాంక్షలు చెప్పకపోవడాన్ని సాధారణ విషయంగానే తీసుకుంటుండగా, మరికొందరు మాత్రం దీనిని ఇద్దరి మధ్య సంబంధాల్లో మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. మొత్తానికి విజయ్-త్రిష పేర్లు మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చకు రావడానికి ఈ ఒక్క విషయం చాలిపోయింది. అయితే సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన ప్రచారాల విషయంలో అధికారిక సమాచారం వచ్చే వరకు జాగ్రత్తగా వ్యవహరించడం అవసరమని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం విజయ్ రాజకీయాల వైపు అడుగులు వేస్తూ కొత్త బాధ్యతల్లో నిమగ్నమై ఉండగా, త్రిష వరుస సినిమాలతో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళు తున్నారు. ఇలాంటి సమయంలో వ్యక్తిగత ప్రచారాల కంటే వారి వృత్తి జీవితానికే ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

# 'మా ఇంటి బంగారం' బృందాన్ని అభినందించిన చిరంజీవి

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతోంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకు సానుకూల స్పందన రావడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లు నమోదవుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా వీక్షించిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ 'మా ఇంటి బంగారం' ఎంతో ఆసక్తికరంగా అనిపించిందని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబం నేపథ్యంగా యాక్షన్, భావోద్వేగాలను చక్కగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో చిత్రాన్ని వినోదాత్మకంగా మలిచారని ప్రశంసించారు. కుటుంబ బంధాలు, అనుబంధాలు, భావోద్వేగాలు కలిసిన కథను ఆకట్టుకునే రీతిలో తెరపై ఆవిష్కరించారని ఆయన అభినందించినట్లు సమాచారం. కథనం నడిపించిన తీరు, పాత్రల మలుపులు, వినోదాన్ని జోడించిన విధానం చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయని చిరంజీవి అభిప్రాయపడ్డారని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. సమంత నటనపై కూడా చిరంజీవి ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, భావోద్వేగ దృశ్యాల్లోనూ సమంత తన పాత్రకు పూర్తి న్యాయం చేశారని కొనియాడినట్లు సమాచారం. మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరమని, అలాంటి కథలకు ప్రేక్షకులు కూడా ఆదరణ చూపుతున్నారని ఆయన



అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ నిడిమోరు సహా మొత్తం చిత్ర బృందం అభినందనలకు అర్హులని చిరంజీవి పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక సమంత వ్యక్తిగత జీవితంపై కూడా చిరంజీవి చేసిన ఒక వ్యాఖ్య ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారి తీసింది. జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన చెప్పిన మాటలను కొందరు అభిమానులు వేర్వేరు రీతుల్లో అర్థం చేసుకుంటున్నారు. అయితే ఆ వ్యాఖ్యకు సంబంధించి ఎలాంటి అధికారిక స్పష్టత లేకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. సమంత గర్భధారణ గురించి చిరంజీవి పరోక్షంగా సంకేతం ఇచ్చారా అనే చర్చ కూడా కొన్ని వర్గాల్లో కనిపిస్తోంది. అయితే దీనిపై సమంత, రాజ్ నిడిమోరు లేదా చిరంజీవి తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ఈ తరహా ప్రచారాలను జాగ్రత్తగా మాత్రమే చూడాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే 'మా ఇంటి బంగారం'కు లభిస్తున్న ఆదరణ, సమంత నటనకు వస్తున్న ప్రశంసలు, ఇప్పుడు చిరంజీవి అభినందనలు కలిసి ఈ చిత్రానికి మరింత ప్రచారం తీసుకొచ్చాయి. మొదటి రోజునుంచే కుటుంబ నేపథ్యం, భావోద్వేగ సన్నివేశాలు, యాక్షన్ మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, సమంత కెరీర్‌లో మరో గుర్తుండిపోయే చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణతో పాటు పరిశ్రమ ప్రముఖుల ప్రశంసలు కూడా బలాన్నిస్తున్నాయి.

# బాహుబలి: ది ఎటర్నల్ వార్

## కీలక అప్‌డేట్‌ను అందించిన ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది. 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం. ప్రభాస్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఆయన చేసిన పోస్ట్ కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైక్స్, వేలాది కామెంట్లను సొంతం చేసుకుంది. ఈ యానిమేషన్ చిత్రాన్ని ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌కు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ యానిమేషన్ దర్శకుడు ఇషాన్ శుక్లా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్ తన పోస్ట్‌లో .. బాహుబలి: ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్ అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా అద్భుతమైన పనిని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు.






# రామ్ సినిమాలో నివేదా?

టాలీవుడ్‌లో తనదైన నటనతో పాటు గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నివేదా పేతురాజ్ మరో క్రేజీ అవకాశాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. 'మెంటల్ మదిలో' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి, ఆ తర్వాత విభిన్న పాత్రలతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న రాబోయే కొత్త చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైనట్లు ఫిల్మ్ నగర్‌లో గట్టిగా ప్రచారం జరుగుతోంది. నివేదా పేతురాజ్ ఇప్పటికే తెలుగులో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. 'చిత్రలహరి', 'బ్రోచేవారెవరురా', 'అల వైకుంఠపురములో' వంటి చిత్రాల్లో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అలాగే 'బ్లడీ మేరీ' వంటి ఓటీటీ చిత్రం, 'విరాట పర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి చిత్రాల్లో కూడా విభిన్నమైన పాత్రల్లో నటించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఇటీవల వచ్చిన 'సింగ్ గీతం' చిత్రంతో కూడా ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇప్పుడు రామ్ పోతినేని సరసన నటించే అవకాశం లభిస్తే ఇది ఆమె కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా మారుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. రామ్ పోతినేని ఎనర్జీకి తగ్గట్టుగా కథానాయిక పాత్రను కూడా దర్శకుడు బలంగా రూపకల్పన చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో నివేదా పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా ?




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయ-బోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**